క్లుప్తంగా

భవిత కేంద్రం పనులు గడువులోగా పూర్తిచేయాలి



భవిత కేంద్రం మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్

మిర్యాలగూడ : భవిత కేంద్రం మరమ్మతు పనులు గడువులోగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలోని భవిత కేంద్రాన్ని ఆయన సందర్శించి జరుగుతున్న పనులను పరిశీలించారు. రూ.4.30లక్షలతో భవిత కేంద్రంలో టాయ్‌లెట్స్ ఫ్లోరింగ్, ప్రహరీ నిర్మాణం, డోర్స్, కిటికీలు, కరెంట్ పని, కలరింగ్ తదితర పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈ పనులను సబ్ కలెక్టర్ పరిశీలించి ఈనెల 15లోగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, ఎంపీడీఓ శేష గిరిశర్మ, ఏఈ జగన్ తదితరులు ఉన్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

నిడమనూరు : నిడమనూరు సహకార సంఘంలో పలు సన్న రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సహకార సంఘం కార్యదర్శి జానయ్య, విక్రయ అధికారి సతీష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సన్న రకాల వరి విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిపారు. సహకార సంఘంలోని విక్రయకేంద్రం నుంచి సన్న రకాల వరి విత్తనాలు, జనుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వరిలో ఆర్ఎన్ఆర్, బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048(టీ-29024), జేజీఎల్-27356, ఎంటీయూ-1001, కందులు వెర్డ్-97 రకం, మినుములు, పీయూ-31, టీబీజీ-194 రకాలు, పెసర్లు, వేరుశన విత్తనాలు పంపిణీ సిద్ధంగా ఉన్నాయని విక్రయాధికారి సతీష్ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి

చింతపల్లి : మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వారికి నిర్వహించిన శిక్షణ అనంతరం వినతిపత్రం అందజేసి వారు మాట్లాడుతూ... చాలీచాలని వేతనాలతో కష్టపడి పని చేస్తున్నామన్నారు. మెస్ బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం చాలా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను పెంచితేనే భోజనం అందించడం సాధ్యమవుతుందన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సాలమ్మ, సైదమ్మ, వెంకటయ్య, రాములమ్మ ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పాలనను ప్రజలకు వివరిద్దాం

చందంపేట : కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరిద్దామని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కేతావత్ లాలునాయక్ అన్నారు. చందంపేట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన చందంపేట మండల సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశంలో అన్ని రంగాల్లో సాధించిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని, పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వినోదాచారి, నరేందర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, రాములు, రమేష్, శ్రీశైలం, వెంకట్, శివ, శివ కృష్ణ, ఆంజనేయులు, అనిల్ పాల్గొన్నారు.

కొండేటి మల్లయ్య ఎంపికపై హర్షం

నిడమనూరు : ప్రదేశ్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, నిడమనూరు మాజీ జెడ్పీటీసీ కొండేటి మల్లయ్య ఎంపికయ్యారు. గత కొన్నేళ్లుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషికి పార్టీ పదవి దక్కిందని స్థానిక కాంగ్రెస్ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో ఉపాధ్యక్షులుగా 27 మందికి స్థానం దక్కగా ఎంపీ రఘువీర్‌తోపాటు సాగర్ నియోజకవర్గం నుంచి కొండేటి మల్లయ్యకు అవకాశం దక్కింది. కొండేటి మల్లయ్య కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి దక్కడంపై కాంగ్రెస్ నాయకులు మెరుగు మధు, వింజమూరి ప్రభాకర్, పంతులు తుకారం, శ్రీను హర్షం వ్యక్తం చేశారు.

సీఐ సతీష్‌రెడ్డికి సన్మానం

హాలియా : సీఐగా ప్రమోషన్ పొందిన హాలియా ఎస్ఐ సతీష్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐగా ప్రమోషన్ పొందిన సతీష్‌రెడ్డిని దళితరత్న అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ వెంకటేశ్వర్లు, దళిత నేతలు ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. అదేవిధంగా దళితరత్న అవార్డు పొందిన ముదిగొండ వెంకటేశ్వర్లును సీఐ సతీష్‌రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఆదిమల్ల శ్రీనివాస్, రేపాకుల శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు జటావత్ జలంధర్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వరిసాగుకే రైతుల మొగ్గు

- ఏఎమ్మార్పీ ఆయకట్టులో నూతనంగా భూములు సాగులోకి..
- 15వేలకు పెరిగిన కౌలు ధర
- ఏటా తగ్గుతున్న పత్తిసాగు
- ప్రత్యామ్నాయ పంటలపై ఆసక్తి చూపని రైతులు



గుర్రంపోడులో చౌడు నేలల్లో ఎర్ర మట్టితోలి వరిసాగుకు సిద్ధం చేస్తున్న రైతు



కొప్పోలులో నూతనంగా అచ్చుకడుతున్న భూమి

గుర్రంపోడు : మండలంలోని ఏఎమ్మార్పీ ఆయకట్టులో ప్రస్తుత సీజన్‌లో వరిసాగు గణనీయంగా పెరగనుంది. గతేడాది వానాకాలం, యాసంగి సీజన్‌లో వరిసాగు విస్తీర్ణం పెరగగా, ఈఏడు కూడా కొత్త ఆయకట్టును రైతులు సిద్ధం చేస్తున్నారు. ప్రాజెక్టులలో నీరు చేరుతుండటంతో యాసంగిలో మండలంలో రికార్డు స్థాయిలో గతంలో ఎన్నడూ లేనంతగా 20,475 ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఈసారి మరో ఐదు వేల ఎకరాల వరిసాగు విస్తీర్ణం పెరగనున్నట్లు అంచనా. గతేడాది రెండు సీజన్‌లలో ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నిరాటంకంగా నీటి విడుదల జరగడం, వరి దిగుబడులు పెరగడం, ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయడం, సన్నాలకు బోనస్‌లతో రైతులు వరిసాగుకే మొగ్గు చూపుతున్నారు.

40వేల ఎకరాలకు పడిపోయిన పత్తి సాగు

గత ఐదేళ్లతో పోలిస్తే మండలంలో పత్తిసాగు 50వేల ఎకరాల నుంచి 40వేల ఎకరాలకు పడిపోయింది. ఈ ఏడాది వరిసాగు పెరుగుతున్న కారణంగా పత్తిసాగు తగ్గనుందని అంచనా. ఆయకట్టులో గత రెండు సీజన్లలో ఏఎమ్మార్పీ ఆయకట్టుకు నీటి విడుదలతో పత్తి పంట సాగు చేసిన చాలా వరకు భూములు జాలు పట్టడం, అధిక నీటితో పత్తి దెబ్బతినడంతో పత్తి సాగుకు ఆసక్తి చూపడం లేదు. గతంలో పత్తి సాగు చేసిన భూములను ఈ యేడు వరిసాగుకు ప్రోక్లెయినర్‌లు, డోజర్ ట్రాక్టర్లతో వరిసాగు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగు ఏదీ

ఇటీవల వ్యవసాయశాఖ వరి, పత్తి పంటలకు ప్రత్యామ్నాయంగా పెసర, కంది పంటలు సాగు చేసుకోవాలని, పండ్లతోటల వైపు ఆసక్తి చూపే రైతులు ఆయిల్ పామ్ సాగు చేయాలని సూచిస్తూ రైతు అవగాహన సదస్సులు నిర్వహించింది. అపరాల పంటలకు ఎకరాకు 8 వేల వరకు మద్దతు ధర ఉందని, లాభదాయకంతోపాటు భూసారం కాపాడే ఈ రకమైన పంటలు సాగు చేయాలని ప్రచారం చేసింది. ఐనప్పటికీ రైతులు అపరాల పంటల సాగుపై ఆసక్తి చూపడం లేదు.

పెరిగిన కౌలు ధర

మండలంలో వరి, పత్తి పంటలకు కౌలు ధర గతంతో పోలిస్తే గణనీయంగా డిమాండ్ పెరిగింది. వరికి ఎకరాకు కౌలు ధర 13 వేల రూపాయల వరకు, పత్తికి 13 నుంచి 15 వేల ఎకరాల వరకు ధర పెరిగింది. కౌలు రైతులకు కౌలుకు భూములు దొరకని పరిస్థితి ఏర్పడింది.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలి



భూసారం తగ్గకుండా ఏటా ఒకే రకమైన వరి, పత్తి పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రత్యామ్నాయ పంటలైన కంది, పెసర పంటలు సాగు చేసుకోవాలని సూచిస్తున్నాం. ఈ రకమైన పంటలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకోగలవు. ఏఎమ్మార్పీ ఆయకట్టులో పెరుగుతున్న వరిసాగుకు అనువుగా విత్తనాలు, ఎరువులను అందించేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

– కంచర్ల మాధవరెడ్డి, మండల వ్యవసాయాధికారి

భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



భూ నిర్వాసితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : భూ నిర్వాసితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాజెక్టుల కింద భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు మంజూరైన నష్టపరిహారం చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. భూ నిర్వాసితులకు నష్టపరిహారం పంపిణీ సమయంలో ఎలాంటి అవకతవకలు జరుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని డిండి ఎత్తిపోతల, నక్కలగండి, అంబాభవాని ప్రాజెక్టుల పూర్తికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. దేవరకొండ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు గుర్తు చేశారు. అనంతరం వివిధ దశల్లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల పురోగతిపై రెవెన్యూ, ఇరిగేషన్, ఫారెస్ట్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ భద్రు, ఈఈ నెహ్రూనాయక్, రాములు నాయక్, యాదన్‌కుమార్, సత్యనారాయణ, డీఎఫ్ఓ రాజశేఖర్, ఆర్డీఓ రమణారెడ్డి, ఎఫ్‌డీఓ సంగీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెలంగాణ విద్యా వికాస వేదిక కన్వీనర్ ప్రభాకర్, తదితరులు

మిర్యాలగూడ : ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ విద్యా వికాస వేదిక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధ్యయనం చేయడం, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం ద్వారా మెరుగైన విద్య విద్యార్థులకు అందించడం కోసం విద్యా వికాస వేదిక కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ కళాశాలలను నియంత్రించాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, పలువురు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను కాపాడుకుందాం



బెజ్జికల్‌లో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, రైతులు

త్రిపురారం : సాగు నీటిని పొదుపుగా వినియోగించుకొని, భూగర్భ జాలాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వరి పరిశోధన స్థానం, కంపాసాగర్ శాస్త్రవేత్త శివ ప్రసాద్ అన్నారు. మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు ముంగిట వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని బెజ్జికల్ గ్రామ పంచాయతీ వద్ద రైతులకు వివిధ రకాల పంటల సాగులో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తక్కువ యూరియా వాడకంతో సాగు ఖర్చులు తగ్గించుకోవడం, అవసరం మేరకు రసాయనిక ఎరువులను వినియోగిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, విత్తనాల ఎంపికలో తీసుకోవాల్సి జాగ్రత్తలతో పాటుగా వర్షాలు సంమృద్ధిగా కురవడానికి చెట్లను విరివిగా పెంచాలని రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ పద్ధతులు సూచించే కర పత్రాలని రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సంధ్యారాణి, ఏఈఓ స్వాతి రైతులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

మిర్యాలగూడ టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జర్నలిస్టులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని సీనియర్ జర్నలిస్ట్ ఖాజా హమీదుద్దీన్ అన్నారు. మంగళవారం సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస్‌రావు అరెస్ట్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో సాక్షి కార్యాలయాలు, యూనిట్లపై దాడి చేయడాన్ని ఖండిస్తూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టులపై అక్రమ అరెస్ట్‌లు, కార్యాలయాలపై దాడులు హేయమైన చర్య అని అన్నారు. పత్రిక స్వేచ్ఛను హరిస్తూ జర్నలిస్టుల హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కుట్రలో భాగమే సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాస్‌రావు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సాక్షి కార్యాలయాలపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేత బంటు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర నేత వస్కుల మట్టయ్య, జర్నలిస్టులు మహ్మద్ అస్లాం, అయ్యూబ్, జంగా లక్ష్మణ్ యాదవ్, సునిల్, రామకృష్ణ, హరీష్, వస్కుల రవి, నాగభూషణం, శివకృష్ణ, ఖాజానాజీముద్దీన్, నాగాచారి, రమేష్, బాలాజీ రావు, రాంప్రసాద్, గణేష్, వినయ్ ఉన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులను చేర్పించండి



అడవిదేవులపల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

మిర్యాలగూడ టౌన్ : రెండున్నర ఏళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ ముదిరెడ్డి నర్సిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి అన్నారు. మంగళవారం అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఈదులగూడెంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పిస్తే జరిగే లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ స్కూల్ హెచ్ఎం లాలునాయక్, అంగన్‌వాడీ టీచర్లు బొందు పార్వతి, సీహెచ్ రామానుజమ్మలతో పాటు హెల్పర్లు, కిశోర బాలికలు, మహిళలు పాల్గొన్నారు.

దేవత్‌పల్లి తండాలో..

డిండి : మండల పరిధిలోని దేవత్‌పల్లితండాలో అంగన్‌వాడీ ఆధ్వర్యంలో మంగళవారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె. రమణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బడి ఈడు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని ఆమె చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, భారతి, బిక్షీ, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల కేంద్రంలో మంగళవారం అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ముత్యాలమ్మ, అంగన్‌వాడీ టీచర్లు నారాయణమ్మ, శోభ, మణేమ్మ, రేణుక, ఆశా వర్కర్ భాగ్యమ్మ, ఆయాలు సైదమ్మ, కళావతి, గిరిజలతో పాటు పిల్లల తల్లులు ఉన్నారు.

అసమానతలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లయ్య

కొండమల్లేపల్లి : ఎమ్మార్పీఎస్ భవిష్యత్ ప్రయాణం అంతా అసమానతలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్య మాదిగ అన్నారు. మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో అయన పాల్గొని మాట్లాడారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ నిర్ణయం మేరకు జూలై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామగ్రామానా అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని జెండావిష్కరణ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఆదిరాల రమేష్‌మాదిగ, సాలయ్య, శ్రీరాములు, జానయ్యమాదిగ, రాములు, శ్రీనుమాదిగ, గడ్డం గిరి, యాదయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలి



మిర్యాలగూడ : మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ



పెద్దవూర : మాట్లాడుతున్న ఎంఈఓ రాములు



చందంపేట : సమావేశంలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లు

మిర్యాలగూడ : విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని దామరచర్ల ఎంఈఓ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు, పాఠశాలల్లో పనిచేసే శానిటేషన్ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శానిటేషన్ సిబ్బంది పాఠశాల ఆవరణలో మొక్కలను నాటి వాటిని పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బండ వెంకట్‌రెడ్డి, సైదానాయక్, బాలు, డీఆర్పీ గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత ప్రమాణాలను పాటించాలని మండల విద్యాధికారి లావూరి బాలునాయక్ అన్నారు. మంగళవారం స్థానిక బకల్‌వాడీ ఉన్నత పాఠశాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కావెంజర్లు, మధ్యాహ్న భోజనం ఏజెన్సీ మహిళలతో పాటు విద్యాశాఖ సిబ్బందికి నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయని, బడి బాట కార్యక్రమాలను నిర్వహించి విద్యార్థుల శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు ఈ సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మంగ్యానాయక్, కరుణాకర్‌రెడ్డి, ధర్మనాయక్, సిద్ధికి, ఆర్పీ వేణుధర్‌లతో పాటు కోర్డినేటర్లు, సీఆర్పీలు తదితరులున్నారు.

మెనూ అమలు చేయాలి

పెద్దవూర : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో ప్రభుత్వ మెనూను అమలు చేసి నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల విద్యాధికారి తరి రాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో పెద్దవూర కాంప్లెక్స్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, శానిటరీ వర్కర్స్‌కు మధ్యాహ్న భోజనంపై నిర్వహించిన ఒకరోజు శిక్షణలో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసి పాఠశాల పరిసరాలను, వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో శిక్షకుడు నరేందర్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

శుభ్రతతో మధ్యాహ్న భోజనం వడ్డించాలి

చింతపల్లి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం శుభ్రతతో ఉండాలని మండల విద్యాధికారి నీరుడు అంజయ్య అన్నారు. ఆదివారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన కార్మికులకు, శానిటేషన్ వర్కర్స్‌లకు శిక్షణ కార్యక్రమన్ని మండల విద్యా శాఖ అధికారి నీరుడు అంజయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ సుజాత, మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

చందంపేట : పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న తరుణంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మెనూ అందించాలని ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు మల్లేష్‌నాయక్, పంతులాల్‌నాయక్‌లు పేర్కొన్నారు. మంగళవారం చందంపేట ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు, స్కావెంజర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పాఠశాల పరిసరాలను బోధనకు అనుకూలంగా ఆహ్లాదంగా ఏర్పాటు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్ఎంలు లోక్యనాయక్, హనూనాయక్, సీసీఓ బాలు, తదితరులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎంపీహెచ్‌డబ్ల్యూలో బోధించుటకు గాను తాత్కాలిక పద్ధతుల్లో మహిళా గెస్ట్ లెక్చరర్ల పోస్టులకు దరఖాస్తులు ప్రారంభమైనట్లు ఎంఈఓ కొనమంచిలి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ మీడియం ఎంపీహెచ్‌డబ్ల్యూలోని మూడు సబ్‌జెక్టులు బోధనకు ఎంఎస్సీ నర్సింగ్ చేసిన వారు లేదా బీఎస్సీ నర్సింగ్‌లో పదేళ్లు ప్రాక్టికల్‌గా కానీ, టీచింగ్‌లో అనుభవజ్ఞులై ఉండాలి. అదేవిధంగా ఇంగ్లిష్ సబ్‌జెక్టు బోధనకు గాను ఎంఏ ఇంగ్లిష్, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని సూచించారు. బుధవారం నుంచి ఈనెల 13వరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని, అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంగ్లీష్ మీడియంలో తాత్కాలిక పద్ధతిలో విద్యాబోధన చేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ కత్తుల సరళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు-1, ఇంగ్లీష్-1, ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1, బోటని-1, జువాలజీ-1, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్(ఎంఎల్‌టి) సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని, పూర్తి వివరాలకు సెల్. 8328121148కు సంప్రదించాలని కోరారు.

రాజీవ్‌గాంధీ స్టేడియంలో క్రీడాకారుల నిరసన

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని ఎస్ఎస్‌పీ క్యాంపులోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో పలువురు క్రీడాకారులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ క్రీడాకారులు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో కేసీఆర్ బహిరంగ సభ సందర్భంగా స్టేజీ వెనుక భాగంలో ప్రహరీ కూల్చినట్లు తెలిపారు. రెండేళ్లు అవుతున్నా ఆ ప్రహరీ ఇప్పటికీ నిర్మించకపోవడంతో క్రికెట్ ఆడే సమయంలో ఆ దారి నుంచి వచ్చే వాహనదారులకు బాల్ తగులుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ ప్రహరీ నిర్మించాలని కోరారు.

పండుగలతో మానవ సంబంధాలు బలోపేతం



ఎమ్మెల్సీ కోటిరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : పండుగలు మానవ సంబంధాలను బలోపేతం చేస్తాయని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. మండలంలోని రాజవరం గ్రామంలో మంగళవారం యాదవులు, కురుమలు నిర్వహించిన లింగమంతులు సౌడమ్మతల్లి జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి మాట్లాడుతూరాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటై కలిసికట్టుగా జాతర నిర్వహించుకోవడం ఐకమత్యాలకు నిదర్శనమన్నారు. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత పొందవచ్చని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీని శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిరాజు, రమణరాజు, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, గురువయ్య, గురులింగం, లచ్చయ్య, నర్సింహా, లింగారెడ్డి పాల్గొన్నారు.

డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలి

మిర్యాలగూడ : గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల డ్రాలో ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు అందించాలని పలు సంఘాల నాయకులు కోరారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో లబ్ధిదారులతో కలిసి వారు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌కు, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ అవేర్నెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ మాధవాచారి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు అర్హులను గుర్తించి డ్రా తీశారని కాని ఇప్పటివరకు ఇళ్లు కేటాయించకపోవడంతో లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారన్నారు. వెంటనే ఎంపిక చేసిన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాధవి, మొహమ్మద్ నాజర్‌అలీమీర్జా, నజీర్, బుర్హాన్‌ఖాన్ పాల్గొన్నారు.